సార్వత్రిక సమ్మెకు పెన్షన్ సంఘాల మద్దతు

ప్రజాశక్తి-కాకినాడ

దేశవ్యాప్తంగా జులై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెకు దేశవ్యాప్తంగా పెన్షన్ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.ఎ.శాస్త్రి, కె.సత్తిరాజు తెలిపారు. ఇటీవల పూణేలో అఖిల భారత ఇపిఎఫ్ పెన్షనర్స్ సంఘాల సమావేశంలో కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ ఇచ్చిన దరఖాస్తులను తిరస్కరించిన వాటిని పున్హ పరిశీలన చేసి వాళ్ళ తిరిగి ఇపిఎఫ్‌కు డబ్బులు చెల్లించడానికి అనుమతి ఇవ్వాలని తీర్మానించిందన్నారు. ఇపిఎఫ్ పెన్షనర్లకు ఉచిత వైద్య సదుపాయం, సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే ప్రయాణాల్లో రాయితీలు పునరుద్ధరించాలని తీర్మానించామన్నారు.

ఉచిత విద్య.. మిథ్య..

- అమలు కాని 25 శాతం సీట్ల పథకం
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- నిర్లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు
- గగ్గోలు పెడుతున్న తల్లిదండ్రులు

కలెక్టరేట్ వద్ద ఉచిత విద్య పథకం బాధిత తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పూర్తిస్థాయిలో ఇవ్వాలని, ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థుల వివరాలను తమ కార్యాలయానికి అందజేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్మిషన్ల విషయంలో తల్లిదండ్రులు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ ఆయా యాజమాన్యాలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పేదలకు దక్కాల్సిన సీట్ల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న పలు ప్రయివేటు కార్పొరేట్ విద్యాసంస్థలు 25 శాతం సీట్లను పూర్తిస్థాయిలో కేటాయించడం లేదు. దీనిపై తల్లిదండ్రులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సుమారు 1800 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 3 లక్షల మంది ఏటా చదువుతున్నారు. ఈ గణాంకాల ఆధారంగా 25 శాతం మందికి నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తే సుమారు 75 వేల మంది పేదలకు ప్రయివేటు విద్యాసంస్థలు ఉచితంగా చదువు చెప్పాల్సి ఉంది. 25 శాతం సీట్లు విద్యాహక్కు చట్టంలో భాగమే అయినా పేద పిల్లలకు ప్రయివేటు విద్య ఎప్పుడూ అందడం లేదు. ప్రయివేటు పాఠశాలల్లో మొదటి తరగతిలో 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించాలని అత్యున్నత న్యాయస్థానం గతంలోనే తీర్పుని వెలువరించినా ప్రభుత్వానికి,అధికారులకు పట్టడం లేదు.

పట్టించుకోని యాజమాన్యాలు

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రయివేటు విద్యాసంస్థలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. మే 27 నుంచి జూన్ 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల కోసం అవకాశం కల్పించారు. అయితే అనేకమంది పేదలు ఒకటో తరగతిలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పలు యాజమాన్యాలు అనేక మంది దరఖాస్తులను తిరస్కరించాయి. వీటికి మూడు దశల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆరు దశల తర్వాత సీట్లను కేటాయిస్తారు. సీట్ల కేటాయింపు తర్వాత విద్యార్థులను వెంటబెట్టుకుని తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ తున్నారు. అక్కడ ప్రయివేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సీట్లను ఇవ్వడంలో తిరకాసు పెట్టి తల్లిదండ్రులను తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇలా 25 శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు దక్కనీయకుండా పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యా హక్కు చట్టాలు ఉన్నా..

2009 నుంచే చట్టం అమలు లోకి వచ్చినా మెజారిటీ ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రయివేటు పాఠశాలలు రైట్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రీ కంపల్సరీ ఎడ్యుకేషన్ రూల్ 2010 ప్రకారం తప్పనిసరిగా 25 శాతం విద్యార్థులకు ఉచిత విద్య అందించాలి. 2012 -13 విద్యా సంవత్సరం నుంచి 25 శాతం ఉచిత విద్య అందించని ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల అనుమతులను రద్దు చేయాలని చట్టాలు ఉన్నా అవి అమలు కావడం లేదు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని జిఒఆర్‌టి 220 ప్రకారం అమలు ప్రకారం ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు హెచ్ఐవి, అనాథ పిల్లలకు ఐదు శాతం, ఎస్‌సిలకు 10 శాతం, ఎస్‌టిలకు 4, బిసి, ఒబిసిలకు ఆరు శాతం మొత్తంగా 25 శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్య అందించాలి.

కలెక్టర్‌కు సమస్యపై విన్నవించాం

ప్రయివేటు పాఠశాలు సుప్రీంకోర్టు, హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలోకి తొక్కి విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయి. దీనిపై ఇప్పటికే కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలికి వినతిపత్రం అందజేశాం. కలెక్టర్ దీనిపై సానుకూలంగా స్పందించారు. మా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నాం.

- వీరబాబు, విద్యార్థి తండ్రి.

యాజమాన్యాలు వేధిస్తున్నాయి

2025-26 విద్యా సంవత్సరంకి ప్రభుత్వం నిర్వహించిన లాటరీ ప్రక్రియలో సీట్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సంబంధిత స్కూలుకు జాయిన్ అవ్వడానికి వెళ్లగా యాజమాన్యాలు సీట్లు ఇవ్వడానికి వ్యతిరేకిస్తున్నాయి. తీవ్ర పదజాలంతో, దూషణలతోనూ మా మనోభావాలను దెబ్బతీస్తున్నాయి.

- దేవరపల్లి ప్రియాంక, కాకినాడ.

యానమాన్యాలు వేధిస్తున్నాయి

లాటరీలో సీట్లు పొందిన వారిని ఆయా యాజమాన్యాలు తీవ్రంగా వేధిస్తున్నాయి. అసంబద్ధ కారణాలను వంకలుగా చూపిస్తూ ఉచిత ప్రవేశాలు కల్పించకుండా బయటకు నెట్టి వేస్తున్నారు. మేమే స్కూలు వద్దకు వచ్చి అడ్మిషన్స్ తీసుకోలేదని తప్పుడు నివేదికను విద్యాశాఖ అధికారులకు ఇస్తున్నారు.

- సత్యవతి, విద్యార్థి తల్లి

టౌన్ బ్యాంక్‌లో మెరుగైన సేవలు

ప్రజాశక్తి-కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ రవీంద్ర

కాకినాడ కో- ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తోందని బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలోని కో ఆపరేటివ్ బ్యాంకుల్లో 46 బ్రాంచీలలో రూ.1,860 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. బుధవారం జయా రెసిడెన్సీ హోటల్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.1,110.40 కోట్ల డిపాజిట్లు, రూ.750.16 కోట్లు రుణాలు ఉన్నట్లు చెప్పారు. మార్చి 31 నాటికి 54,243 మంది సభ్యులతో రూ.29.37 కోట్లు వాటా ధనం కలిగి ఉందని, బ్యాంకుకు రూ.184.56 కోట్ల సొంత నిధులు ఉన్నాయన్నారు. ఈ ఏడాది సభ్యులకు 12 శాతం డివిడెంట్ ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదించిందని చెప్పారు. బ్యాంకు గతంలో లాగానే ఈ ఏడాది కూడా ఎ గ్రేడ్ సాధించి ముందంజలో ఉందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.వెయ్యికోట్లు దాటడంతో రిజర్వ్ బ్యాంక్ టౌన్ బ్యాంకును టైర్ త్రీ స్థాయి బ్యాంకుగా గుర్తించిందని ఇది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ తర్వాత స్థానంలో ఉందని తెలిపారు. రూ.2 వేల కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా బ్యాంకు పాలకవర్గం ముందుకు సాగుతోందని రవీంద్ర వెల్లడించారు. ఖాతాదారులకు సుమారు 45 ఏళ్ల నుండి టౌన్ బ్యాంక్ రకరకాల సేవలందిస్తూ వారి మన్ననలను పొందుతోందని చైర్మన్ రవీంద్ర చెప్పారు. బ్యాంకు వైస్ చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, డైరెక్టర్లు సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, కంటిపూడి సత్యనారాయణ, అయ్యగారి వెంకటేష్, ఎండి సుధీర్ కుమార్, సిఇఒ సి.సుగుణ రావు, నల్లమిల్లి జనార్ధన రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులపై రైతుల హర్షం

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని ఎఫ్‌కె.పాలెం గ్రామంలోని పాపిడిదొడ్డి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ జరపరాదని, ఒకవేళ తవ్వకాలు జరుగుతుంటే తక్షణమే నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిందని గ్రామానికి చెందిన పలువురు రైతులు, గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో మట్టి తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ గత నెలలో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారన్నారు. ఈ చెరువు ఇప్పటికే చాలా లోతుగా ఉండడం వల్ల మరోసారి మట్టి తవ్వకాలు చేస్తే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అక్రమ మట్టి తవ్వకాల వలన సాగునీరు అందక పొలాలన్నీ బీడు భూములుగా మారతాయని ఇరిగేషన్, మైన్స్ అధికారులకు ప్రజాప్రతినిధులకు అనేకసార్లు విన్నవించామని, జిల్లా కలెక్టర్‌కు రెండు మూడుసార్లు కలిసి వినతి పత్రాలు అందించామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మట్టి తవ్వకాలు జరపకుండా తగు చర్యలు చేపట్టాలని పోలీసులకు కూడా వినతిపత్రాలు అందించామన్నారు. కానీ కొందరు అధికార పార్టీ నేతలు అక్రమ మట్టి తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చాలా విచారకరం అన్నారు. దీంతో న్యాయం కోసం రైతులంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించగా మట్టి తవ్వకాలను నిలిపివేయాలని హైకోర్ట్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. చెరువులో వేలాది లారీల మట్టిని తవ్వుకుని పోవడంతో చెరువు పెద్ద పెద్ద గోతుల మయంగా మారిందని, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందే పరిస్థితి లేదని వారు తెలిపారు. పంట భూమి మెరక కోసం ఒక రైతు పేరుతో అనుమతి తీసుకుని ఇటుకల బట్టీలకు మట్టిని తరలించుకుపోయినా అధికారులు ఏ ఒక్కరూ పట్టించుకోని వైనంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆడ్డగోలు మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ చేసి మట్టి మాఫియాపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ ముమ్మిడి మహాలక్ష్మి శేఖర్, రైతులు ముమ్మిడి వెంకన్నబాబు, మలిరెడ్డి పల్లపురాజు, కోలా రవికుమార్, జవ్వాది కృష్ణమాధవరావు, రామిరెడ్డి రామచంద్రుడు, జవ్వాది భాస్కరరావు, అనసూరి గోపి, ముమ్మిడి తాటికొండ, రెడ్డి సత్యనారాయణ, రామిరెడ్డి అప్పారావు, పాలికి సతీష్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శతాబ్ది పార్కు వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ 11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్‌పై ట్రీ కటింగ్‌లో భాగంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ ఎవిఎన్‌డిఎస్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల పట్టణ పరిధిలోని కొత్తపేట, సినిమా సెంటర్, వ్యాపారపుంత, గౌరికోనేరు, ఆర్‌బి.పట్నం రోడ్డు, శివాలయం వీధి, సుబ్బయ్యపేట తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

మహిళలకు ఆదాయం పెరగాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మహిళా సంఘ సభ్యులకు ఉపాధితో పాటు ఆదాయం పెరిగే విధంగా కృషి చేయాలని డిఆర్‌డిఒ పీడీ జి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని చేబ్రోలులో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆయన మహిళా సంఘాల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ప్రాజెక్టు కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించి గ్రామ సంఘాల్లో పని చేస్తున్న విఒఎల విధులు, బాధ్యతలపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘాల ద్వారా ఇతర పథకాల ద్వారా ఇచ్చిన ప్రతి రుణం జీవనోపాధి కార్యక్రమాలకు ఏర్పాటు చేసుకునేలా ఉపాధి కల్పించి ఆదాయం పెరిగే విధంగా బాధ్యతగా పని చేయాలని తెలిపారు. ఎపిడి జిలాని, డిపిఎం వెంకటేశ్వరరావు, ఎపిఎం సన్యాసిరావు, సిసిలు రాజకుమారి నాయుడు, వెంకటరమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



జగన్‌పై మరో కేసు

50వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 50వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ తమ నిరసన తెలిపారు. అనంతరం ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 50 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యలను సానుభూతితో పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, అయ్యప్ప స్వామి, కె.వెంకటరమణ, మల్లిపెద్ది వీరభద్రరావు, ఒ.సోనియా, సుంకర సత్తిరాజు, పచ్చిపాల శ్రీను, డి.సత్తిరాజు, మహాపాతిన అరుణ్, బొమ్మన రవికుమార్, గజ్జి సతీష్, నాలం శివకుమార్, పూల ప్రశాంత్, జి.నాగేశ్వరరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జెవివిలో చేరండి.. పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

స్థానిక జెడ్‌పి పాఠశాల ఆవరణలో బుధవారం జన విజ్ఞాన వేదిక 37 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జెవివిలో చేరండి పోస్టర్‌ను నాయకులు దాడి పద్మనాభం, ఏలేటి నాని బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సమతా కన్వీనర్ సిహెచ్‌యుఆర్.మంగతాయారు మాట్లాడారు. ప్రజల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఏర్పడిన నాటి నుంచి కృషి చేస్తోందన్నారు. ప్రజానీకంలో శాస్త్ర విజ్ఞాన ప్రచారం శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, శాస్త్ర విజ్ఞానం ద్వారా మూఢవిశ్వాసాలను చాందస భావాలను ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల మౌలిక స్వరూప స్వభావాలను గూర్చి సమగ్రమైన శాస్త్రీయ అవగాహన పెంపొందించడంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించడంతోపాటు శాస్త్ర విజ్ఞాన ఫలాలు సామాన్య ప్రజలకు కూడా అంతేలా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సిహెచ్.సూర్యప్రకాశ్ రెడ్డి, ధర్మరాజు, జెవివి మండల ప్రధాన కార్యదర్శి దాసం గోవిందరాజు, ఉపాధ్యాయులు ఒ.పాపారావు, కె.వెంకటేశ్వరరావు పాధ్యాయులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-పిఠాపురం

ప్రజాప్రతినిధులంటే అధికారులకు కూటమి ప్రభుత్వానికి లెక్కే లేదనిస్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు విమర్శించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడంతో ఎంపిపి సహా ఎంపిటిసిలు, సర్పంచులు బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ తాము ఉత్సవ విగ్రహాలుగా మారామన్నారు. సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం తమను అవమానించడమే అన్నారు. నాలుగేళ్లుగా అధికారులు ఇదే ఒరవడిని కొనసాగిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలో చేపట్టి తర్వాత మంత్రి పవన్ కళ్యాణ్ ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా పరిస్థితుల్లో మార్పు వస్తుందేమో అనుకున్నామని కానీ ఎటువంటి మార్పు కానరావడం లేదన్నారు. అధికార పార్టీ నేతలు గ్రామాల్లో కూటమిగా ఏర్పడి పనులు పంచుకుని దోచుకుతింటున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా నేటికీ ఒక సమావేశానికైనా ఎంఎల్ఎ, ఎంపీ హాజరు కాలేదన్నారు. సమస్యలు ఎలా పరిష్కరించాలి ఎవరితో చెప్పాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచ్‌లు బండి సుబ్బులు, కె.రమణ బాబ్జి, ముమ్మిడి మహాలక్ష్మి శేఖర్, వరలక్ష్మి, నల్లా రాంబాబు, నానిబాబు, అడపా రఘు, జవ్వాది వాడపల్లి, అప్పాజీ, ఎం.శ్రీనివాసరావు, కె.సోమరాజు, అయ్యారావు, కర్ణీడి దుర్గాభవాని, ప్రమీల పాల్గొన్నారు.

నేడు నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

మండల పశు వైద్య కేంద్రంలో గొర్రెలు మేకలకు గురువారం నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రమీల తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సామర్లకోట ప్రభుత్వ పశు వైద్య శాలలో మేకలు గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని నట్టల నివారణ మందులను పంపిణీ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

అతిసార నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వర్షాకాలం కావడంతో అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రజలకు అవగాహన కలిగించేందుకు బుధవారం ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి ప్రధాన వైద్యురాలు డాక్టర్ ఎం.సౌభాగ్య మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీరు కలుషితం కావడం, ఈగల వాలిన, నిలువ ఉన్న, అరుగుదల తక్కువగా ఉన్న మాంసం, చేపలు వంటి ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. టాయిలెట్ ఉపయోగించిన తర్వాత వంట చేసే ముందు వంట చేసిన తర్వాత పిల్లలకు డైపర్స్ మార్చిన తర్వాత శుభ్రంగా సబ్బుతో చేతులు కడుక్కోవాలని ఆమె సూచించారు. అతిసార వ్యాధి చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యం తీసుకోకుంటే ప్రాణాంతకం అయ్యే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. హెల్త్ సూపర్వైజర్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా మరిడమ్మ జాగరణ ఉత్సవాలు

ప్రజాశక్తి - పెద్దాపురం


ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

మరిడమ్మ అమ్మవారి జాగరణ ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఉత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవం ప్రారంభానికి ముందు ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవమూర్తిని విద్యుత్ దీపాలంకరణ మధ్య రథంపై ఊరేగించారు. ఈ ఉత్సవంలో భాగంగా గరగల నృత్యాలు, పెద్ద పులాటలు, సాము గరిడీలు, తప్పెటగుళ్లు, కాళికా నృత్యాలు, జానపద కళారూపాలు ప్రదర్శించారు. వేలాదిమంది జనం పాల్గొన్న ఈ ఉత్సవంలో ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, నూనె రామారావు, కొరుపూరి రాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు. పాత పెద్దాపురంలో మరిడమ్మ అమ్మవారి జాగరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మరిడమ్మకు ఒకే రోజు రెండు ప్రాంతాలలో జాగరణ ఉత్సవం నిర్వహించటం విశేషం. జాతర కమిటీ సభ్యులు వంగలపూడి సతీష్, లంక గోవిందు, గరగ శ్రీనివాస్, కోమలి పెద్దరాజు, తామాడ శివ, దంగేటి మధు, కోమలి వెంకటరమణ, కాకరపల్లి శ్రీనివాస్, మామిడాల రాము, ఏసుబాబు పాల్గొన్నారు.

28న పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎజెండాలోని 23 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కాంట్రాక్టు కమిటీ సమావేశంలో మూడు అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి పాల్గొంటారన్నారు. మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఇళ్లపై 11కెవి విద్యుత్ తీగలతో ఇక్కట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

అధికారులకు సమస్యను వివరిస్తున్న మహిళలు

సామర్లకోట బ్రౌన్‌పేట శివారులో కందకం ఏరియాలోని ఇళ్లపై 11 కెవి వైర్లు ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, తమ ఇళ్లపై వీటిని తొలగించి రక్షణ కల్పించాలని బ్రౌన్ పేటకు చెందిన ఏరియా ప్రజలు బుధవారం ట్రాన్స్‌కో అధికారులు కిరణ్, రమేష్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా తమ ఇళ్లపై 11 కెవి విద్యుత్ వైర్లు ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా వర్షాలు, గాలివానల సమయంలో విద్యుత్ వైర్లు తగులుకొని మంటలు వ్యాపిస్తున్నాయని, దీని కారణంగా భయభ్రాంతులకు గురవుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వైర్లు ఇళ్ల మీద నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని వారు విన్నవించారు. తగిన చర్యలు తీసుకుని ఉన్న ఇళ్ల యజమానులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.2.12 కోట్లు

ప్రజాశక్తి శంకవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి హుండీల లెక్కింపు ద్వారా రూ.2,12,31,410 ఆదాయం లభించింది. బుధవారం కొండపైన ఇఒ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అధికారులు 35 రోజుల్లో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటు 602.500 మిల్లీ గ్రాముల బంగారం, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించినట్టు ఇఒ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బాబూరావు, వివిధ విభాగాల ఎఇఒలు, సిబ్బంది పాల్గొన్నారు

అన్నవరంలో ఘనంగా మరిడమ్మ జాతర

ప్రజాశక్తి శంఖవరం

అన్నవరంలో మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం రైల్వే స్టేషన్ రహదారిలో ఉన్న మరిడమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, వైసిపి నాయకులు యనమల కృష్ణుడు, దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక సత్యదేవ ఆటో యూనియన్ నిర్వాహకులు యాత్రికులకు భారీగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన వివిధ దేవతా మూర్తులతో కలిగిన బండ్ల వేషాలు బ్యాండ్ మేళాలు విచిత్ర వేషధారణలు, అలరించాయి

నారుమళ్లు త్వరగా వేసుకోవాలి

ప్రజాశక్తి-కాజులూరు

నారు మళ్ల త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడ, కాజులూరు గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. రైతులు నారుమళ్ల త్వరితగతిన పూర్తి చేసుకుంటే కోతల సమయంలో వర్షాల బారిన పడకుండా ఉంటారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నారుమళ్లకు నష్టం రాకుండా నీటిని ఎప్పటికప్పుడు బయటకు పోయేలా గాళు తీసుకుంటే నష్టం ఉండదన్నారు. మండలంలో సుమారు 19 వేల ఎకరాల్లో వరి సేద్యం చేస్తుండగా ఖరీఫ్‌లో పల్లపు ప్రాంతాల్లో నారుమళ్ల వేసుకుని నాట్లు వేసుకుంటే నష్టం జరగకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎసిబికి చిక్కిన విఆర్‌ఒ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ విఆర్‌ఒ ఎసిబి చిక్కాడు. మండలంలోని చల్లపల్లి చింతలచెరువు సచివాలయంలో గ్రేడ్-1 విఆర్‌ఒగా పనిచేస్తున్న పరసా శ్రీమన్నారాయణ తన తల్లి పేర కొనుగోలు చేసిన భూమికి పట్టాదారు పాస్ బుక్ ఇచ్చేందుకు కొంత సొమ్ము తీసుకుని ఇంకా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు రైతు శ్రీరామ్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. దీంతో బుధవారం విఆర్‌ఒ శ్రీమన్నారాయణ ఇంటి వద్ద రైతు రూ.20 వేలు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి విఆర్‌ఒను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విఆర్‌ఒను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

హత్యాయత్నం కేసులో ఐదుగురికి ఆలమూరు జెఎఫ్ సిఎం కోర్టు న్యాయమూర్తి బుధవారం రిమాండ్ విధించినట్లు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 22న వడ్లమూరు గ్రామంలో పాత గొడవల నేపథ్యంలో కొంతమంది గ్రూపుగా ఏర్పడి ముగ్గురిపై దాడి చేశారు. ఈ దాడిపై కేసు నమోదు చేసి ఈ దాడికి కారణమైన కొల్లాటి సురేష్‌తోపాటు, మరో నలుగురిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నామని కొవ్వూరు డివిజన్ టాస్క్ ఫోర్స్ ఎఎస్ఐ గంగాధరరావు తెలిపారు. తాళ్లపూడి బోట్ మెన్ సొసైటీ వద్ద లోడ్ చేసుకుని సుమారు 20 టన్నుల ఇసుకతో తాళ్లపూడి మండలం నుంచి వెళుతున్న లారీని గజ్జరం గ్రామం వద్ద పట్టుకుని తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

బాలిక ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి - సీతానగరం

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన 16 బాలిక పసల అర్పణ అచూకీని సీతానగరం పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు తన తండ్రి అరుణ్‌బాబు మందలించాడనే కోపంతో అర్పణ ఇంటి నుంచి బయటకు వచ్చింది. సీతానగరం గ్రామానికి చేరుకున్న ఆమెను స్థానికుల సాయంతో గుర్తించారు. వివరాలు సేకరించిన అనంతరం బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలికను రాజమండ్రి చైల్డ్ వెల్ఫేర్ సంరక్షణకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

హుండీల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కడియం

కడియం పోస్ట్ ఆఫీస్ వీధిలో గల శ్రీ లక్ష్మీ గణపతి గుడిలో గల హుండీని మే 31 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి డబ్బులను దొంగిలించారు. ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. కడియం దేవి సెంటర్ వద్ద బుధవారం అనుమానంగా తిరుగుతున్న, రాజమహేంద్రవరానికి చెందిన కసినికోట బాల పోసిగణేష్, మరో మైనర్‌ను అరెస్టు చేశారు. విచారణలో నేరం ఒప్పుకోవడంతో వారిని కోర్టుకు తరలించామని బి.నాగదుర్గాప్రసాద్ తెలిపారు.

ఎపి పిజిఇ సెట్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య ఫార్మసీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎపిపిజిఇ సెట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థిని మల్లిపాటి సుమిత్ర రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంక్‌తో పాటు, నైపర్, జెఇఇలో కూడా అర్హత సాధించినట్లు తెలిపారు. ఆదిత్య ఫార్మసీ కళాశాలల విద్యార్థులు 35 మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని మల్లిపాటి సుమిత్ర, ఆమె తల్లిదండ్రులను ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డాక్టర్ డి.సతీష్ కుమార్, డాక్టర్ కె.రవిశంకర్ పాల్గొన్నారు.

ఆదిత్యలో ఎన్‌సిసి వార్షిక ట్రైనింగ్ క్యాంప్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఈ నెల 22న ప్రారంభమైన ఎన్‌సిసి వార్షిక ట్రైనింగ్ క్యాంపు ఉత్సాహంగా సాగుతోందని క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. ఈ ట్రైనింగ్ క్యాంపులో విద్యార్థులకు క్రమశిక్షణ, రైఫిల్ వినియోగం, డ్రిల్, మ్యాప్ రీడింగ్, దేశభక్తి, ఆరోగ్యం పరిశుభ్రత, నాయకత్వ లక్షణాలు వంటి వివిధ అంశాలపై పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు త్రివిధ దళాలలో చేరే విధంగా ఆసక్తిని కల్పిస్తామని తెలిపారు. ట్రైనింగ్‌లో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్లకు డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక ఉపన్యాసాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం క్రీడలు, యోగాపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపరాఉ.

అనధికార హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలో అనధికారికంగా నిర్వహిస్తున్న హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కీర్తిమణికంఠ, మండల కార్యదర్శి సిహెచ్.నరసింహమూర్తి బుధవారం ఎంఇఒకు ఫిర్యాదు చేశారు. ఓ ప్రయివేటు పాఠశాలలో అనధికారికంగా హాస్టల్ నిర్వహిస్తున్నారని, అందులో విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. తక్షణం ఈ హాస్టల్‌ను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. వారి వెంట నాయకులు శ్రీరామ్, సాయి, వాసు, సుమంత్, వీరబాబు, వెంకటరమణ, పండు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

బురదతో అస్తవ్యస్తంగా ఉన్న రహదారి

ప్రమాదకరంగా రహదారి..

ప్రజాశక్తి - యానాం

యానాం - ద్రాక్షారామ రోడ్డులో స్థానిక గోపాల్ నగర్ సెంటర్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఆ రోడ్‌లో వాటర్ పైపు లైన్ కోసం రోడ్డును తవ్వి పైపు లైన్ వేసిన అనంతరం మట్టితో మొక్కుబడిగా పూడ్చి వదిలివేశారు. అప్పటి నుంచి రోడ్డు అస్థవ్యస్థంగా మారడంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు అన్నీ గోతిలో దిగబడుతున్నా సంబంధిత అధికారులు నేటికీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ప్రస్తుతం రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రోడ్డు అంతా పూర్తిగా బురదతో చిత్తడిగా మారింది. ఈ పరిస్థితి వల్ల వాహనాలు స్కిడ్ అయ్యి పడిపోతున్నారని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పాదచారులు నడవడానికి కూడా ఇక్కట్లు పడుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి తవ్విన రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

హోమ్ మంత్రి నమశ్శివాయంతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

హోమ్ మంత్రితో ఎంఎల్ఎ అశోక్ భేటీ

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ పరిధిలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పుదుచ్చేరి హోమ్ మంత్రి నమ్మవాయంకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వినతిపత్రం అందించారు. యానాంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గెస్ట్ టీచర్‌లు, పారా టీచర్లుగా పనిచేస్తున్న వారి సేవలను రెన్యువల్ చేయాలని అదేవిధంగా పర్మినెంట్ సైతం చేయాలని కోరారు. పుదుచ్చేరి స్టేట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీలో కోచ్‌ల నియామకం చేయాలని ప్రస్తుతం చేస్తున్న వాళ్లను రెగ్యులర్ చేయాలని కోరారు. డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని వారికి న్యాయం చేయాలని కోరారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యానాంలో పలు కీలక ప్రాంతాల్లో సిసి నిఘా కెమేరాలు అమర్చాలని కోరారు.

విజేతలతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఘనంగా జోనల్ స్కూల్ గేమ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక వైయస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో జోనల్ స్కూల్ గేమ్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలలో వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14 బాల బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఎంజిజి బాయ్స్ హైస్కూల్, ద్వితీయ స్థానంలో రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, తృతీయ స్థానంలో యానాం పబ్లిక్ స్కూల్ నిలిచాయి. అండర్ - 17 బాలుర విభాగంలో మొదటి స్థానంలో రీజెన్సీ జూనియర్ కాలేజ్, ద్వితీయ స్థానంలో ఆర్‌జిజిఇఎం హెచ్ స్కూల్, తృతీయ స్థానంలో ఎంజిజి బాయ్స్ హైస్కూల్ గెలుపొందాయి. అండర్-14 బాలికల విభాగంలో మొదటి స్థానంలో గిరియంపేట పికెజి హెచ్‌ఎస్ స్కూల్, ద్వితీయ స్థానంలో దరియాలతిప్ప హైస్కూల్, తృయ స్థానంలో ఎస్‌కెఎస్‌పివి ఆర్‌ఎన్.కనకాలపేట స్కూలు విజయం సాధించాయి. గెలుపొందిన క్రీడాకారులకు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు పాము సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌ఎఒ మునిస్వామి

డయేరియా నివారణకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - యానాం

డయేరియా వ్యాధి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి సూచించారు. ఈ సందర్భంగా బుధవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అతిసార వ్యాధిపై పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు అవగాహన చేయాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచిన నీరు మాత్రమే తాగాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వ్యాధుల ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఆసుపత్రి ఎడి పలాస్ కుమార్ సన్యాల్, సోషల్ వెల్ఫేర్ అధికారి రాజేంద్ర, విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, పిడబ్ల్యుడి ఎఇ కాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే...

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చిన్న వర్షానికే ఏలేశ్వరం మండలంలోని ఆర్ అండ్ బి రహదారులు చెరువులుగా మారుతున్నాయి. ఏలేశ్వరం క్వారీ వద్ద వర్షాలు పడితే మోకాళ్ళ లోతు నీరు నిలిచిపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా తయారయ్యింది. గిరిజన మండలాలకు వెళ్లే రమణయ్యపేట, జె.అన్నవరం రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా వర్షం నీటితో నిండిన గుంతల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ రోడ్డు మీద ప్రయాణం అంటే ప్రాణాలతో చెలగాటమని భావించిన రావొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం, గంగవరం గిరిజన మండలాల ప్రజలు వైద్యం ఇతర అవసరాలకు ఏలేశ్వరం రావడం మానుకున్నారు. దూరమైన గోకవరం, రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఈ రహదారి నిర్మాణాలకు అనుమతులు మంజూరైనా నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించి కాలువలు తవ్వి రోడ్డు పనులు నిలిపివేశారు. ఈ రోడ్డు కాంట్రాక్టర్ వైసిపి జిల్లా నాయకునికి ముఖ్య అనుచరుడు కావడంతో జిల్లాలో మరిన్ని కాంట్రాక్టులు పొంది అందులో కొన్ని రోడ్డు పనులను పూర్తి చేశాడు. సదరు కాంట్రాక్టర్ పూర్తి చేసిన రోడ్లకు నిధులు మంజూరు

అధ్వానంగా ఉన్న రహదారి

చేస్తేనే ఈ రోడ్డు నిర్మాణం చేపడతానని కోర్టును ఆశ్రయించారు. విధి లేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కూడా అదే కాంట్రాక్టర్‌కు రోడ్డు నిర్మాణ పనులు అప్పగించింది. కోర్టు కేసు సాకుగా చూపి సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి గోతులను పూడ్చి గ్రావెల్ వేశారు. అనునిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడంతో మరలా రోడ్డు గ్రావెల్ మట్టి పక్కకు పోయి మరింత దారుణంగా తయారయ్యింది.

ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నంలో మార్షల్ హైస్కూల్‌లో బుధవారం స్థానిక హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించారు. పాఠశాల ప్రారంభం నుంచి ఉపాధ్యాయ సిబ్బందిగా పని చేస్తున్న సిబ్బందికి అభినందన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ నోవాహు, ప్రిన్సిపల్ మంజుల మాట్లాడుతూ 2005లో ప్రారంభించిన తమ పాఠశాల నేటికి 20 వసంతాలు పూర్తి చేసుకుని ఎన్నో విజయాలను సాధించినట్లు చెప్పారు. విద్యార్థులకు మంచి విద్యాబోధన అందిస్తూ మార్షల్ హైస్కూల్ ముందుకు దూసుకుపోతోందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అనేకమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి తోడ్పడుతోందన్నారు. ఈ సందర్భంగా 2024-2025లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థికి రూ.4 వేల చొప్పున నగదు బహుమతులను మార్షల్ స్కూల్ జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల ప్రారంభించినప్పటి నుండి పాఠశాల అభివద్ధికి కషి చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా వారు ఘనంగా సత్కరించారు. వేడుకల్లో పాల్గొన్న ఎపి శెట్టిబలిజ కార్పొరేషన్

విద్యార్థులను సత్కరిస్తున్న యాజమాన్యం, సిబ్బంది

డైరెక్టర్ వెంకీ వెంకటేష్ బాబు, వైసిపి నాయకులు మేడిశెట్టి వెంకట రమణ, గ్రామపంచాయతీ సెక్రటరీ, సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.బ్లెస్సింగ్, ఎ.చంటి, జిఎ.రాజు, జి.రజిని పాల్గొన్నారు.

మహిళా సర్పంచుల శిక్షణ ముగింపు

ప్రజాశక్తి - సామర్లకోట

మార్పు ద్వారా విజేతలు - మహిళా సాధికారతతోనే స్వపరిపాలన అనే అంశంతో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ముగిసింది. ఈ శిక్షణలో రాజమండ్రి డివిజన్‌కు చెందిన మహిళా సర్పంచులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు మాట్లాడుతూ, ఈ శిక్షణ కొత్తగా, ఉపయోగకరంగా ఉండి, పరిపాలన సంబంధ అంశాలను సమగ్రంగా వివరించారని చెప్పారు. తమ గ్రామాల్లో అభివద్ధికి 'మేము సైతం' అనే సంకల్పంతో ముందడుగు వేస్తామని వారు పేర్కొన్నారు. బుధవారం తరగతుల ముగింపు సందర్భంగా వరకు సర్టిఫికెట్లు అందజేశారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - జగ్గంపేట

ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మల్లిసాల గ్రామానికి చెందిన పి.తేజశ్రీ నాగు, గోకవరం మండలం కొత్తపల్లికి చెందిన ఎం.బాల రాజేష్ ఒంగోలు ఐటి క్యాంపస్‌లో సీట్లు పొందారు. గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన పి.మనోహర్‌కు శ్రీకాకుళం ఐటి క్యాంపస్‌లో సీటు వచ్చింది. వారిని ఎంఎల్ఎ నెహ్రూ సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు, టిడిపి నాయకులు రేఖ బుల్లి రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సొంత మండలాల్లో పని చేసే అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి - గోపాలపురం

సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో పనిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ మరియు గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఎంపిడిఒ రాజ్‌మనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండున్నరేళ్లుగా నేషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వలేదని, స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ కల్పించి, రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏ విధంగా వినియోగించు కుంటుందనే విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగులు తమ సొంత మండలాల్లో పని చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. జెఎసి చైర్మన్ ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. సచివాలయం ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కె.తారకరమేష్, ట్రెజరర్ జి.అనిల్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్, సర్వే అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయకులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రానికి కృషి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రం దిశగా పయనించేలా ప్రతి వ్యక్తీ కృషి చేయాలని నిడదవోలు ఎక్సైజ్ సిఐ శ్రీరాం సతీష్ విద్యార్థులకు సూచించారు. ఈనెల 26వ తేదీ అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని వేలివెన్నులో శ్రీమతి అన్నపూర్ణ విద్యా నికేతన్‌లో విద్యార్థులకు మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తులు ఆర్థికంగా, శారీరకంగా బలహీనులు కావడమే కాకుండా కుటుంబ పరంగా, సమాజపరంగా చెడ్డ పేరు పొందుతారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల వైపు మనసు మరలకుండా ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కరరామయ్య, ఎక్సైజ్ ఎస్.ఐ బాలాజీ, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని విజయవాడకు చెందిన డాన్ బాస్కో నవ జీవన బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల క్లస్టర్ కో-ఆర్డినేటర్ శ్రీతేజ సూచించారు. బుధవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం మండల సమాఖ్య కార్యాలయంలోని సిసి, విఒఎలకు సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు గ్రామాలతో పాటు, మండలంలోని ఉండ్రాజవరం, దమ్మెన్ను, వడ్లూరు గ్రామాలను దత్తత గ్రామాలుగా తమ సంస్థ స్వీకరించిందన్నారు. స్థానిక ప్రభుత్వ అధికారుల సహకారంతో, తమ సంస్థ తరఫున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న ప్రస్తుతం కాలంలో వాటి బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు.

సమ్మెలో కార్మికులు పాల్గొనాలి

ప్రజాశక్తి-కాకినాడ

కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైల్వే కార్మికులందరూ పాల్గొనాలని సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ రైల్వే కార్మికులను కోరారు. రైల్వే రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చడం ద్వారా కార్మిక హక్కులను లేకుండా చేయాలని చూస్తోందన్నారు. కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ వంటి చట్టాలు మార్పు జరుగుతున్నావని దీనివల్ల కార్మికులు మరింత దుర్భర పరిస్థితుల్లోకి నెట్టబడతారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల వ్యవస్థను రద్దు చేసి కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు అందరూ పాల్గొని ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తారని అన్నారు. నరేష్, బాబి, లక్ష్మీ, వీర రాఘవ, సుబ్బలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ

ఎస్ఐకు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - జగ్గంపేట

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఎస్ఐ టి.రఘునాధరావు బుధవారం ఎస్‌పి బింధుమాధవ్ ద్వారా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసిన పలు కేసుల్లో ఎస్ఐ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆయనను ఎస్‌పి అభినందిస్తూ ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐకు పలువురు అభినందనలు తెలిపారు.

దస్తావేజు పడిపోయినది

బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మా తండ్రిగారైన విత్తనాల వెంకట్రావు రామచంద్రపురం మున్సిపాలిటీలో కొన్న ఇంటి స్థలం సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు మరియు సదరు దస్తావేజులకు సంబంధించిన లింకు దస్తావేజు ఒరిజినల్ ది. 1-6-2025 తేదీన ఆలమూరు కోర్టు రోడ్డులో గల జిరాక్స్ తీయించుటకు తీసుకొని వెళుతుండగా, లింకు, ఒరిజినల్ దస్తావేజులు, 7-8-1982 తేదీ గల డాక్యుమెంట్స్ నెం. 2699/1992 గలవి పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యోడల ఈ కింది అడ్రస్ తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

అడ్రస్: వి.వి.వి.సత్యనారాయణ
అడ్వకేట్, ఆలమూరు
సెల్ నెం 9491190137

లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని జగ్గమ్మగారిపేటలో కొద్ది రోజులుగా ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజి సమస్యకు పరిష్కారం లభించింది. జగ్గమ్మగారి పేటకు సంబంధించి స్థానిక అన్న క్యాంటీన్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో తరచూ లోపాలు తలెత్తుతుండడంతో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో ఎఇ ఎం.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రిపేరు పనులు చేపట్టారు.

రిపేరు పనులు చేస్తున్న సిబ్బంది

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి. నెం. 758/2020-ఇ1 తేది.24-06-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో ఎనభై ఒకటి (81) పనులకు రూ. 453.99 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరు పిలువబడినది.

15 పనులకు షార్టు టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది. 25-06-2025 సా॥ 07.00ల నుండి ముగింపు తేది. 03-07-2025 సా॥ 04.00ల వరకు

మరియు

66 పనులకు టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది. 25-06-2025 సా॥ 7.00ల నుండి ముగింపు తేది. 11-07-2025 సా॥ 04.00ల వరకు

మిగిలిన వివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

సం/- **కమిషనరు,** అమలాపురం పురపాలక సంఘం

ఘనంగా రత్తాలమ్మ జాతర

ప్రజాశక్తి-తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగిలో గ్రామ దేవత రత్తాలమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. వారం రోజులుగా జరుగుతున్న జాతర, తీర్థ మహోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల సంబరాలు నిర్వహించి గ్రామస్తులంతా పోతురాజు జాతర నిర్వహించారు. గ్రామస్తులు గరగలను ఎత్తుకొని నృత్యాలు చేశారు. గ్రామస్తులంతా మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

7న వైసిపి సమావేశం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న కాకినాడ సూర్య కళామందిరంలో నిర్వహిస్తున్న పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశానికి ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి భారీగా తరలి రావాలని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు.

రమేష్ మరణం తీరని లోటు

ప్రజాశక్తి-శంఖవరం

సత్యదేవ లయన్స్ క్లబ్ సభ్యుడు తెలగం శెట్టి రమేష్ బాబు మరణం తమ క్లబ్‌కు తీరని లోటని క్లబ్ సలహాదారు దొంగాడ గిరి అన్నారు. రమేష్ బాబు ఆర్‌ఎంపిగా పని చేస్తూ 2008 నుంచి రెండు పర్యాయాలు క్లబ్ సభ్యునిగా, అధ్యక్షునిగా, కార్యదర్శిగా సేవలందించారని తెలిపారు. జానకి దేవి, ప్రకాష్, నాగేశ్వరావు, కె.సత్యనారాయణ, సూరిబాబు, ల్యాబ్ వాసు, నానాజీ సంతాపం తెలిపారు.

In the Court of the 1st Addl. Junior Civil Judge, Rajahmundry
O.S. No. 50/2025

Between:
Sri Venkateswara Swamy Sand & Boatmen Labour Contract Cooperative Society Ltd., rep. by its Secretary, K.V.Rao.
...*Plaintif*
AND
Eedala Chaya Bhavani and Others
...*Defendants*

D-3: Eedala Bhaskara Chowdary, S/o. (late) Srinivas, D.No. 80-3-12, Vikas Nagar, J.N.Road, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు నోటీసు నిమిత్తం **ది. 01-7-2025 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు.** కావున మీరు వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

రాజమండ్రి
24-6-25
సిహెచ్.వి.ప్రసాద్
వాది తరపు అడ్వకేటు
రాజమండ్రి

జనరల్ నోటీసు

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 699/2025 in
O.S. No. 461/2025

Between:
Binniboina Asha Bharathi, W/o. Sunil Kumar, Brindavanam Street, Near: Ramalayam, Bitragunta, rep. by Power of Attorney Agent, Palivela Veera Satyanarayana, S/o. Ramachandra Rao, Door No. 82-17-03/F, Mahalakshmi Temple, A.V.Appa Rao Road, Rajahmundry.

2. Bommanaboina Satya Jyothi, C/o Sathi Raju, Door No. 60-7-26/3, P&T Colony, Rajahmundry, rep. by Power of Attorney Agent, Bommanaboina Sathi Raju, S/o. Reddiah, P&T Colony, Rajahmundry.

...*Petitioners/ Plaintiffs*
AND

1. State of Andhra Pradesh, rep. by its Collector, East Godavari District, Andhra Pradesh.
2. Collector, East Godavari District, Rajamahendravaram.
3. Tahsildar, Rajanagaram, East Godavari District.
4. Executive Engineer, Panchayat Raj Dept., Rajanagaram, East Godavari District.
5. Adabala Veera Venkata Satyanarayana @ Babi, S/o. Rambala Subrahmanya, Seetarampuram, Rajanagaram Mandal.
6. Bobbara Varahalu, S/o. Appa Rao, Sarpanch, Seetharampuram, Rajanagaram Mandal.
7. G.Dhanalakshmi, Panchayat Secretary, Seetharampuram, Rajanagaram Mandal,
8. Vegisetti Venkata Ramana, S/o. Srinu, Surveyor, Seetarampuram, Rajanagaram Mandal.

(Defendants 5 to 8 for themselves and as representatives of their like minded persons)
...*Respondents/ Defendants*

పై నెంబరు దావా షెడ్యూలు దాఖలా భూమిని రాజానగరం మండలం, సీతారాంపురం గ్రామం నందు రోడ్డుగా Convert చేయుటకు ప్రయత్నం చేయుచున్నందున పై నెంబరు దావాను వాద్లు, ప్రతివాద్లు 5 నుండి 8 ల పైన మరియు తమకు సమాన హక్కులు మరియు అభిప్రాయములును కల్గిన ఇతరుల పైన "రిప్రజెంటేటివ్ కెపాసిటీ"లో దావా దాఖలు చేసినందున అందు విషయమై ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో **30-6-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను.

(By Order of the Court)

మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
రాజమండ్రి అడ్వకేట్సు, దానవాయిపేట
ది. 10-5-2025 రాజమండ్రి